# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
10-8-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 139

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## రష్యా నుంచి భారత్‌కు రైలు మార్గం..

**సరికొత్త కారిడార్‌పై భారీ ప్లాన్!**

- భారత్‌తో రైల్వే కనెక్టివిటీ ఏర్పాటుకు రష్యా ప్రయత్నాలు
- హిందూ మహాసముద్రానికి ప్రత్యామ్నాయ భూమార్గంపై దృష్టి
- తుర్క్‌మెనిస్థాన్, ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్, పాక్ మీదుగా మార్గం పరిశీలన
- కీలక సముద్ర జలసంధులపై ఆధారపడటం తగ్గించుకోవడమే లక్ష్యం
- ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని స్పష్టం


భారత్‌తో నేరుగా రైల్వే కనెక్టివిటీని ఏర్పాటు చేసి, తద్వారా హిందూ మహాసముద్రానికి భూమార్గం ద్వారా చేరుకునే అవకాశాలపై రష్యా అన్వేషిస్తోంది. ఈ భారీ ప్రాజెక్టుపై మాస్కో తీవ్రంగా దృష్టి సారించిందని, ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను అభివృద్ధి చేయడంలో భాగంగా ఈ ప్రణాళికను పరిశీలిస్తున్నామని రష్యా ఉప ప్రధాని మరాత్ ఖుస్నుల్లిన్ స్వయంగా

2,6లో

## కొలువు ఒకటే.. జీతాలు రెండు!

తెలంగాణ బాలనాయంత్రాంగంలో భారీ వైఫల్యం ఒకటి వెలుగులోకి వచ్చింది. అది మామూలు అక్రమం కాదు. విస్తు పోయే అక్రమ పర్వమే. ఒకే ఆధార్ నెంబర్ తో వేర్వేరు పేర్లతో ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించడమే కాకుండా.. నెలకు లక్షల్లో రెండు జీతాలు దర్జాగా వెలగబెడుతున్న ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర ఆర్థిక శాఖ చేపట్టిన సాంకేతిక తనిఖీల్లో ఈ విషయం బయటకు వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను మరింత పారదర్శకంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐఎఫ్ఎమ్ఐఎస్ పోర్టల్ లో ఉద్యోగుల ఆధార్, సర్వీసు వివరాల ధ్రువీకరణ చేపట్టాల్సి ఉంది. ఇందుకుగాను ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ తనిఖీ ప్రక్రియ ప్రారంభం కాగా.. భారీగా అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి.

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో




**తెలంగాణ పాలన యంత్రాంగంలో భారీ స్కాం**

**ఉద్యోగుల వివరాలు తెలుసుకునే క్రమంలో వెలుగులోకి..**

**రాష్ట్ర ప్రభుత్వం సీరియస్**

**కఠిన చర్యలకు ఉపక్రమణ..**

ఏకంగా 40 మంది.... రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు ఈ తనిఖీ ప్రక్రియను ప్రారంభించారు. కానీ 40 ఆధార్ నెంబర్లకు ఏకంగా 80 మంది ఉద్యోగుల వివరాలు అనుసంధానమై ఉన్నట్లు గుర్తించారు. అంటే ఒక్క ఆధార్ నెంబర్ పై ఇద్దరు ఉద్యోగులు వేరువేరు పేర్లతో ప్రభుత్వ ఖజానా నుంచి ప్రతినెల జీతాలు పొందుతున్నారన్నమాట. అయితే ఒకే ఆధార్ పై రెండేసి జీతాలు తీసుకుంటున్న వారిలో ఎక్కువ మంది రెగ్యులర్ ఉద్యోగులే ఉన్నారు. ఒక్కో ఉద్యోగి హోదాను బట్టి నెలకు లక్ష నుంచి ఏకంగా నాలుగు లక్షల వరకు ప్రభుత్వ ధనాన్ని చట్ట విరుద్ధంగా డ్రా చేస్తున్నట్లు

- మిగతా 2వ పేజీలో



## ఒంటరిగానే బిజెపి!

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో బిజెపి ఒంటరి పోరాటానికి మొగ్గు చూపిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. స్థానిక సంస్థల నుంచి అసెంబ్లీ ఎన్నికల వరకు పార్టీ ఒంటరిగానే బరిలో దిగుతుందని బిజెపి రాష్ట్ర చీఫ్ రామచంద్రరావు స్పష్టం చేశారు. ఢిల్లీలో అగ్రనేతలతో భేటీ తర్వాత.. పొత్తుల ప్రచారానికి తెరదించుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు చేసిన ఈ ప్రకటన ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. తెలంగాణలో పార్టీ సొంత బలం మీద ఆధారపడి.. ప్రధాన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడమే లక్ష్యంగా హై కమాండ్ వ్యూహరచన చేసినట్లు స్పష్టమవుతోంది. జనసేనతో

- తెలంగాణలో పొత్తులపై తేల్చేసిన హై కమాండ్
- జనసేనకు ఛాన్స్ ఇవ్వని కమలదళం
- ఇతర పార్టీలకు సైతం దూరంగా ఉండాలని నిర్ణయం

### సొంత అజెండాతో వెళితే వేటు!

**తెలంగాణ బిజెపి నేతలకు హై కమాండ్ స్ట్రాంగ్ వార్నింగ్**

**అందరి పనితీరు తన వద్ద ఉందంటూ నితిన్ నబీన్ హెచ్చరిక**

**సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచన**



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో** :రాష్ట్ర బిజెపి నేతలకు గట్టి హెచ్చరికలు వచ్చాయా?

2లో

## ఆ ఓట్లు గల్లంతు వెనుక!



తెలంగాణలో 60 లక్షల ఓట్లు ఔట్ కానున్నాయా? ఆ ఓట్లన్నీంటిని తొలగించనున్నారా? అదే జరిగితే రాజకీయంగా ఏ పార్టీకి నష్టం? తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్లో దీనిపైనే చర్చ నడుస్తోంది. తెలంగాణలో సర్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. మరో ఐదు రోజుల గడువు మాత్రమే ఉంది.

**తెలంగాణలో 60 లక్షలు ఔట్**

**అన్ని పార్టీల్లోనూ ఆందోళన**

**ఏపీతో పోల్చుకుంటే ఎక్కువగానే..**

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: దీంతో అధికారులు కసరత్తు వేగవంతం చేశారు. ఏన్యుమరేషన్ ఫారాల సమర్పణ కోసం క్షేత్రస్థాయిలో ఓటర్లను కలుస్తున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టే అవకాశం కనిపిస్తోంది. ఈనెల 10 తర్వాత ప్రక్రియను పూర్తి చేసి ముసాయిదాను ప్రకటించనున్నారు. అయితే భారీగా ఓట్లు తగ్గనుండడంతో అన్ని రాజకీయ పార్టీల్లో ఆందోళన నెలకొంది.

- మిగతా 2వ పేజీలో



## తెలంగాణకు వైరల్ జ్వరం

- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- గాంధీ, ఉస్మానియా, ఫీవర్ ఆస్పత్రుల్లో
- ప్రతి 10 కేసుల్లో 9 మంది జ్వరబాధితులే
- ఫీవర్ క్లినిక్స్ ఏర్పాటుపై వైద్యశాఖ నిర్లక్ష్యం



## రాజమండ్రి ప్రమాద ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి

**రాజమండ్రి రోడ్డు ప్రమాద బాధితురాలు, మెడికో ప్రియాంక చికిత్స పొందుతూ కన్నుమూత**

**సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచిన వైనం**

**మరణాన్ని ధ్రువీకరించిన వైద్యులు**

**ప్రమాదానికి కారణమైన ఇద్దరు నిందితులు ఇప్పటికే అరెస్ట్**

రాజమండ్రిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మెడికో ప్రియాంక మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. గత ఐదు రోజులుగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం తుదిశ్వాస విడిచింది. ఓ వైద్యురాలిగా

2లో



## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ అండ..

## రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం

- పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి కేసీఆర్ నివాళులు
- కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ అధినేత
- ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున అందజేత..
- అమ్మ అమృతమ్మ సంక్షేమానికి రూ.25 లక్షలు బ్యాంకులో జమ
- నల్లబెల్లిలో కేసీఆర్ పర్యటనకు భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

వరంగల్, ఆగస్టు: దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అండగా నిలిచారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన.. పిల్లల చదువులు, భవిష్యత్తు, కుటుంబ

## తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ..

- ఆక్టోపస్ బిల్డింగ్ వరకు క్యూలైన్లు
- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల భారీ రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు నిండి బయటకు చేరిన క్యూలైన్లు
- గోగర్భం డ్యామ్ సర్కిల్ వద్ద ఆక్టోపస్ భవనం వరకు బారులు
- సర్వదర్శనానికి 20 నుంచి 24 గంటల నిరీక్షణ
- ఒక్కరోజే రూ.4.13 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం

2లో

## ఇవాళ జరిగిన దాడిలో చనిపోయి ఉండేదాన్ని: మమతా బెనర్జీ

- పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ కారుపై రాళ్ల దాడి
- మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లగా ఘటన
- పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందని మమత ఆరోపణ
- దాడిని ఖండించిన బీజేపీ, తమకు సంబంధం లేదని వెల్లడి

# ఆ ఓట్లు గల్లంతు వెనుక!

**10 వరకు సర్..** రాష్ట్రవ్యాప్తంగా భారీగా ఓట్లు తగ్గుతాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో ఈ ప్రక్రియ కొలిక్కి రాకపోవడంతో గడువు పెంచుతూ వచ్చారు. ఈనెల 10 వరకు పొడిగించారు. ఈ మొత్తం ప్రక్రియలు 60 లక్షల ఓటర్ల మేర తగ్గవచ్చు అని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏపీలో అయితే 44 లక్షల ఓటర్ల సంఖ్య తగ్గింది. అయితే తొలగించే ప్రతి ఓటరుకు నోటీసులు ఇస్తారు. వారి వివరణ తీసుకుంటారు. ఆ తరువాతే నిర్ణయం ఉంటుంది అనేది ఎన్నికల అధికారుల అభిప్రాయం. సర్ నమోదులో భాగంగా ఇల్లు మారిన ఓటర్ల వివరాలు సేకరణలో ఇబ్బందులు తప్పడం లేదు. చనిపోయిన వారితో పాటు డూప్లికేట్ ఓట్లు, ఇతర రాష్ట్రాల వారి ఓట్లు వంటివి దీనికి కారణంగా చెబుతున్నారు. అయితే ఈ నెల 10 తో గడువు ముగుస్తుంది. మరో నాలుగు రోజుల సమయం ఉండడంతో అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేశారు.

**అందరిలోనూ ఆందోళన..**

అన్ని రాజకీయ పార్టీల్లో దీనిపై ఆందోళన కనిపిస్తోంది. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి దీనిపై ఆందోళనతో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ తీరును ఆక్షేపిస్తున్నాయి. అయితే భారతీయ జనతా పార్టీ మాత్రం స్వాగతిస్తోంది. అయితే తమ పార్టీకి చెందిన సానుభూతిపరుల ఓట్లు తొలగించకుండా ఉండేందుకు ఆ పార్టీ శ్రేణులు గట్టి ప్రయత్నాలు చేసాయి. ఇప్పటివరకు సహకరించిన వివరాలకు సంబంధించి 77.66% డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయింది. కానీ ఈ ప్రక్రియ హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో మందకొడిగా సాగుతోంది. ఈ ప్రాంతాల్లో భారీ సంఖ్యలో ఓటర్లు ఉండడం.. అపార్ట్మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, చిరునామా నిర్ధారణలో ఇబ్బంది వంటివి జాప్యానికి కారణం.



మొత్తానికి సర్ ప్రక్రియ పూర్తయ్యేసరికి రాష్ట్రంలో 60 లక్షలకు పైగా ఓట్లు తగ్గే అవకాశం ఉంది. దాదాపు 40 లక్షల మంది ఓటర్ల జాబితాలోని చిరునామాలు అందుబాటులో లేని విషయాన్ని అధికారులు గుర్తించారు.

## కొలువు ఒకటే.. జీతాలు రెండు!

వెలుగు చూసింది. ముఖ్యంగా పోలీస్, రెవెన్యూ, విద్యాశాఖ, పంచాయితీ రాజ్, ప్రజారోగ్య శాఖలో ఇలాంటి డూప్లికేట్ కేసులు ఎక్కువగా నమోదయినట్లు ఆర్థిక శాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.

**కఠిన దండన**

ప్రభుత్వం ఉద్యోగుల వివరాలను పారదర్శకంగా పోర్టల్ లో పొందుపరచాలని లక్ష్యంతో ఈ క్రాస్ చెక్ చేపడుతుండగా.. భారీ అక్రమాలు వెలుగు చూస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. దీనిని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం.. డూప్లికేట్ ఆధార్ మ్యాపింగ్ లపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని.. అక్రమాలకు పాల్పడిన వారిని నిర్దాక్షణ్యంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఒకటి కంటే ఎక్కువ ప్రభుత్వ సంస్థలు లేదా శాఖల నుంచి అక్రమంగా జీతాలు పొందినట్లు రుజువైతే సదరు ఉద్యోగులపై తక్షణమే శాఖా పరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించింది. వారి నుంచి ఆ జీతాలను రికవరీ చేయాలని కూడా స్పష్టం చేసింది. తీవ్ర నేరంగా పరిగణించి జైలుకు కూడా పంపాలని ఆదేశించింది. అయితే ఈ అవకతవకలకు పాల్పడిన వారిపైనే కాకుండా సహకరించిన అధికారులపై కూడా చర్యలకు ఉపక్రమిస్తుంది రాష్ట్ర ప్రభుత్వం. దీంతో ఈ స్కాంతో సంబంధం ఉన్న ఉద్యోగులు,, సహకరించిన అధికారుల్లో భయాందోళనలు మొదలయ్యాయి.

## రాజమండ్రి ప్రమాద ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి

ఎంతో భవిష్యత్తు ఉన్న ప్రియాంక అర్ధాంతరంగా తనువు చాలించడంతో ఆమె కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే, ఆగస్టు 3వ తేదీన తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని ప్రసాదిత్యమాల్ ప్రాంతంలో ప్రియాంక తన స్కూటర్‌పై వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపిన సురవరపు దశ్వంత్, ఆంధ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ అనే ఇద్దరు యువకులు ఆమె స్కూటర్‌ను ఉద్దేశపూర్వకంగా మూడుసార్లు ఢీకొట్టారు. ఈ ఘటనలో ప్రియాంక తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను రాజమండ్రిలోని స్థానిక ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించారు. అక్కడ ఆమెను కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ఆమె కోలుకోలేకపోయింది. శుక్రవారం మధ్యాహ్నం 3:25 గంటలకు ప్రియాంక తుదిశ్వాస విడిచినట్టు కిమ్స్ వైద్యులు ప్రకటించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులు దశ్వంత్, ఆంధ్రూలను ఇప్పటికే అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. కాగా, తన కుమార్తె మృతికి కారణమైన వారిపై సాధారణ ప్రమాద కేసు కాకుండా, హత్య కేసు నమోదు చేయాలని ప్రియాంక తండ్రి డిమాండ్ చేశారు. ఇది కేవలం ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యేనని ఆయన ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా సీసీటీవీ ఫుటేజి పరిశీలించిన అనంతరం, కావాలనే ఢీకొట్టినట్టు గుర్తించారు. హత్యాయత్నం సెక్షన్లతో కేసును మరింత పకడ్డందీగా మార్చారు. ప్రియాంక స్వస్థలం తెలంగాణలోని గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్ పూర్. ఆమె ఎంబీబీఎస్ అనంతరం రాజమండ్రిలో పీజీ చేస్తోంది. ఇప్పుడు ఆమె మృతితో స్వగ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ అండ..
## రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం



సంక్షేమాన్ని తాము ఎల్లవేళలా పర్యవేక్షిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదిన కార్యక్రమాన్ని ఆదివారం వరంగల్ జిల్లాలోని నల్లబెల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేసీఆర్ హాజరై కుటుంబ సభ్యులను ఓదార్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి.. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం కుటుంబానికి రూ. 2.25 కోట్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కును అందజేశారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున, ఆయన తల్లి అమృతమ్మ సంక్షేమం కోసం రూ. 25 లక్షలను బ్యాంకులో జమ చేయాలని నిర్ణయించారు. వారి కుటుంబానికి పార్టీ తరఫున, వ్యక్తిగతంగా ఎల్లవేళలా అండగా ఉంటామని కేసీఆర్ భరోసా ఇచ్చారు. కార్యక్రమం అనంతరం కేసీఆర్ సిద్ధిపేట జిల్లా ఎర్రవల్లి ఫాంహౌస్‌కు బయలుదేరారు. కేసీఆర్ పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నల్లబెల్లికి తరలివచ్చారు.

## తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ..

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు బయటకు విస్తరించాయి. గోగర్భం డ్యామ్ సర్కిల్ సమీపంలోని ఆక్టోపస్ భవనం వరకు భక్తులు కిలోమీటర్ల మేర బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతోందని అధికారులు వెల్లడించారు.నిన్న (ఆగస్టు 8) మొత్తం 87,658 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 40,606 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.13 కోట్లుగా నమోదైంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు 4.15 లక్షల లడ్డూలను విక్రయించగా, 3.09 లక్షల మందికి అన్నప్రసాదం అందించారు.వారాంతం కావడంతో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగినట్లు తెలుస్తోంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అధికారులు తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలు కల్పిస్తూ రద్దీని క్రమబద్ధీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. భారీ రద్దీ నేపథ్యంలో, తిరుమలకు వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని టీటీడీ సూచిస్తోంది.

## ఒంటరిగానే బిజెపి!

పాటు భారత రాష్ట్ర సమితి లాంటి పార్టీతో సైతం పొత్తు ఉండదు అని తేల్చి చెప్పడం విశేషం. ఏపీలో ఎన్డీఏ హిట్.. ఏపీలో ఇప్పటికే భారతీయ జనతా పార్టీ తెలుగుదేశం పార్టీతో పాటు జనసేనతో పొత్తు పెట్టుకుంది. అక్కడ ఎన్డీఏ కూటమి నడుస్తోంది. తెలంగాణలో సైతం అదే ఆలోచనతో బిజెపి ఉన్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. ప్రత్యేకంగా పవన్ కళ్యాణ్ కు చెందిన జనసేన పార్టీతో బిజెపి మైత్రి కొనసాగుతుందని అంచనాలు ఉండేవి. అయితే రెండు రాష్ట్రాల రాజకీయ పరిస్థితులు, సమీకరణలు వేరువేరుగా ఉంటాయని తెలంగాణ బిజెపి హై కమాన్ ఈ నిర్ణయానికి వచ్చింది. ఏపీలోని రాజకీయ వాతావరణాన్ని.. తెలంగాణకు ముడి పెట్టడం సాధ్యం కాదని బిజెపి నాయకత్వం స్పష్టమైన అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది.

**సొంతంగా బలోపేతం కావాలని..**

పశ్చిమ బెంగాల్ గెలుపు తర్వాత.. తమ తదుపరి లక్ష్యం తెలంగాణ అని ప్రకటించింది బిజెపి.. అందుకే రాష్ట్రంలో తన సొంత క్యాడర్ను, ఓటు బ్యాంకు ను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఢిల్లీ వర్గాలు భావిస్తున్నాయి. పొత్తు పెట్టుకోవడం వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న సొంత పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మస్థైర్యం దెబ్బతిని అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్.. ఇలా రెండింటిని సమంగా ఎదుర్కొంటూ.. ఏకైక ప్రత్యామ్నాయంగా నిలబడాలన్నదే లక్ష్యంగా ముందుకు సాగుతోంది భారతీయ జనతా పార్టీ.

**2028 లో క్లారిటీ..**

త్వరలో గ్రేటర్ హైదరాబాద్ తో పాటు మిగిలిన కార్పొరేషన్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో పొత్తు లేదని చెప్పడం ద్వారా అక్కడ బిజెపి మరింత అప్రమత్తమవుతోంది. బలమైన నాయకులను అభ్యర్థులుగా రంగంలోకి దించాలని చూస్తోంది. అయితే ప్రస్తుతానికైతే పొత్తులు ఉండవు కానీ.. తెలంగాణ అసెంబ్లీ తో పాటు సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలతో పొత్తు ఉండే అవకాశం ఉంది. తెలంగాణలో అధికారంలోకి రావాలనుకుంటున్న బీజేపీకి గ్రామీణ స్థాయిలో బలం అంతంత మాత్రమే. అది కావాలంటే భారత రాష్ట్ర సమితి లాంటి పార్టీతో పొత్తు పెట్టుకోవడమే ఉత్తమం. అయితే 2028 నాటికి దీని పై పూర్తిస్థాయిలో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.



## సొంత అజెండాతో వెళితే వేటు!

అందరి జాతకాలు బిజెపి పెద్దలు వద్ద ఉన్నాయా? అందుకే ఢిల్లీ పిలిచి మరి తలంటారా? పనితీరు మార్చుకోమని హెచ్చరికలు జారీ చేశారా? లేకుంటే మార్చేస్తామని కూడా వార్నింగ్ ఇచ్చారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఢిల్లీలో తెలంగాణ బిజెపి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఇది ఆషామాషీగా జరగలేదని.. పార్టీ హై కమాండ్ నేతలకు గట్టి హెచ్చరికలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

**విభేదాలపై ఫోకస్..**

తెలంగాణ బిజెపిలో విభేదాల పర్వం నడుస్తున్న సంగతి అందరికీ తెలిసిన విషయమే. ఈ విషయాన్ని గుర్తించింది పార్టీ హై కమాండ్. అయితే ఈ సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ గట్టిగానే హెచ్చరికలు పంపినట్లు తెలుస్తోంది. చెప్పాలనుకున్నది నేరుగా కుండలు బద్దలు కొట్టేసినట్లు ప్రచారం జరుగుతుంది. సాధారణంగా ఎంతో సౌమ్యంగా, శాంతిగా మాట్లాడుతారు నితిన్ నబీన్. అయితే పార్టీ అంతర్గత సమీక్షలు, సమావేశాల్లో మాత్రం తీవ్ర స్వరంతో గట్టి హెచ్చరికలు పంపుతుంటారు. ఇప్పుడు అదే పని చేయడంతో రాష్ట్ర నేతలు ఒక్కసారిగా ఆత్మరక్షణలో పడిపోయారు.

**ఇకనుంచి ప్రతి వారం సమీక్ష..**

రాష్ట్రంలో కొంతమంది నేతలు అనుసరిస్తున్న వైఖరిపై హై కమాండ్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. వర్గాలుగా విడిపోయి క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని పక్కన పెట్టడంపై కూడా అసంతృప్తిగా ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో గణనీయమైన ఓట్లు, సీట్లు పొందినప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం పార్టీ బలపడకపోవడంపై కారణాలేంటి అనే దానిపై అన్వేషించింది హై కమాండ్. ఇటీవల వచ్చిన నివేదికలతో నితిన్ నబీన్ తెలంగాణ బిజెపి నేతలతో ఒక ఆట ఆడుకున్నట్లు తెలుస్తోంది. నేతల మధ్య సమన్వయం లేకపోతే సహించేది లేదని.. ప్రతివారం ప్రగతి నివేదికలను స్వయంగా పరిశీలిస్తానని ఆయన స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

**ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందే..**

బిజెపి ఎంపీలతో పాటు ఎమ్మెల్యేలు సొంత అజెండాకు ముందుకు వెళ్ళొద్దని కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది హై కమాండ్. వర్గ పోరు కనిపించిన మరుక్షణం చర్యలకు ఉపక్రమిస్తామని కూడా హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలు తమ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాత్రి వేళల్లో బస చేస్తూ.. నిరంతరం ప్రజల్లో ఉండాలని ఆదేశాలు కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు మిగతా కార్పొరేషన్లలో అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేయాలని గట్టి హెచ్చరికలు పంపినట్లు తెలుస్తోంది. తెలంగాణలో భారత రాష్ట్ర సమితి బలహీనపడుతున్నందున.. అధికార కాంగ్రెస్కు ప్రత్యామ్నాయం బిజెపి అన్నట్టు ప్రజల్లోకి వెళ్లాలని జాతీయ నాయకత్వం సూచించింది. మరి చూడాలి ఈ హెచ్చరికలు ఎంతవరకు పని చేస్తాయో?...

## ఇవాళ జరిగిన దాడిలో చనిపోయి ఉండేదాన్ని: మమతా బెనర్జీ

కస్టడీ మరణాన్ని రాజకీయం చేస్తున్నారంటూ మమతపై సువేందు అధికారి విమర్శ పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయాణిస్తున్న కారుపై నిరసనకారులు దాడికి పాల్పడ్డారు. కోల్‌కతా సమీపంలోని ఉత్తర 24 పరగణాల జిల్లా హాలిసహర్‌లో ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆమె కాన్వాయ్‌పై కొందరు రాళ్లు, ఇటుకలు, వాటర్ బాటిళ్లు విసిరారు. పోలీసు కస్టడీలో మరణించినట్లు భావిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కార్యకర్త బిర్జూ కియోట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమతా బెనర్జీ వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. దోపిడీ ఆరోపణలపై అరెస్టయిన బిర్జూ, పోలీసుల కస్టడీలో మరణించాడు. ఈ నేపథ్యంలో, మమత పర్యటనను వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఆమె కారును చుట్టుముట్టి, దానిపై బురద పూశారు. "చోర్ భగావో" (దొంగను తరిమేయండి) అంటూ నినాదాలు చేశారు. ఈ దాడిపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. పోలీసుల సమక్షంలోనే గుర్తుతెలియని వ్యక్తులు తన వాహనంపై రాళ్లతో దాడి చేశారని ఆమె ఆరోపించారు. "కారు అద్దాలు మూసి ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాను. లేదంటే ఆ రాళ్లు తలకు తగిలి నా తల పగిలిపోయేది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, వారు కేవలం అధికార బీజేపీకి మాత్రమే రక్షణ కల్పిస్తున్నారని మండిపడ్డారు. ఆమెతో పాటు ఉన్న



లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ డోలా సేన్ కూడా అధికారుల వైఫల్యాన్ని విమర్శించారు. ఈ ఘటనను రాష్ట్ర బీజేపీ చీఫ్ సమీక్ భట్టాచార్య ఖండించారు. ఈ దాడితో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు. అయితే, సీఎం సువేందు అధికారి దీన్ని మమత సృష్టించిన డ్రామాగా అభివర్ణించారు. కస్టడీ మరణాన్ని రాజకీయం చేసేందుకే మమత బలవంతంగా ఆ ప్రాంతానికి వెళ్లారని ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులు అధికారుల తీరుపై సంతృప్తి చెందారని, మరణానికి కచ్చితమైన కారణం తెలియాలని మాత్రమే వారు కోరుకుంటున్నారని తెలిపారు. తన పర్యటనతో మమత ప్రజా జీవితానికి ఆటంకం కలిగించారని విమర్శించారు. ఇటీవలే మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై కూడా ఆయన నియోజకవర్గంలో దాడి జరిగిన నేపథ్యంలో, తాజా ఘటనతో రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

## తెలంగాణకు వైరల్ జ్వరం

తెలంగాణలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రుల్లో అవుట్ పేషెంట్ (ఓపీ) కౌంటర్లు కిటకిటలాడుతున్నాయి. నాలుగైదు రోజులుగా రాష్ట్రంలోని అన్ని దవాఖానాల్లో జ్వర కేసుల సంఖ్య పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. రాష్ట్రమంతటా వర్షాలు కురుస్తుండడంతో నీరు కలుషితమవడం, చల్లటి వాతావరణ పరిస్థితుల కారణంగా కొన్ని రకాల వైరస్‌లు విజృంభిస్తున్నాయి. నీరు, ఆహారం కలుషితం కావడంతో డయేరియా కేసులు కూడా నమోదవుతున్నాయి. హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా, ఫీవర్ ఆస్పత్రులకు వచ్చే ప్రతి పది ఓపీ కేసుల్లో 9 మంది జ్వర బాధితులే ఉంటున్నారు. నాగర్‌కర్నూల్ ప్రభుత్వాస్పత్రిలో గత వారం ప్రతి పది కేసుల్లో నాలుగైదు జ్వర కేసులు వస్తే.. మూడు నాలుగు రోజులుగా 7–8 కేసులు నమోదు అవుతున్నట్లు అక్కడి వైద్యులు చెబుతున్నారు. అలాగే పటానచెరువు ఆస్పత్రిలో గత కొద్దిరోజులుగా జ్వర కేసులతో ఓపీ కిటకిటలాడిపోతోంది. రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో ఎడినో వైరస్ కేసులు నమోదవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ వైరస్ బారిన పడితే తీవ్రమైన జ్వరం, విపరీతంగా విరేచనాలు అవుతాయి. ఒళ్లు నొప్పులతో పాటు జ్వరం 102 నుంచి 104 డిగ్రీల వరకు ఉంటుంది. వైరల్ అయితే కనీసం ఐదారు రోజుల పాటు తీవ్రమైన జ్వరం ఉంటుంది. కొందరిలో గొంతు నొప్పి, ఫ్లూ లాంటి లక్షణాలూ కనిపిస్తున్నాయని జిల్లాల్లోని వైద్యులు చెబుతున్నారు. ఎడినో వైరస్, వైరల్ జ్వరాలతో పాటు డెంగీ కేసులు కూడా నమోదవుతున్నాయని అంటున్నారు.

**ఫీవర్ సర్వే.. క్లినిక్స్.. ఎక్కడ?:** రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు మారిన నేపథ్యంలో ప్రజారోగ్య విభాగం అప్రమత్తంగా ఉండాలి. కానీ, ఫీవర్ కేసులు పెరుగుతున్నా ఉన్నతాధికారులు మొద్దునిద్ర వీడడం లేదు. జిల్లాల్లో పర్యటించడం లేదు. క్షేత్రస్థాయి అనుభవం లేకపోవడంతో ఇటువంటి పరిస్థితులను సరిగ్గా ఎదుర్కోలేకపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఇటువంటి పరిస్థితుల్లో రోజువారీ ఫీవర్ కేసుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాలి. అలాగే తీవ్రత ఎక్కువగా ఉన్న జిల్లాలను గుర్తించి, తక్షణమే ఫీవర్ సర్వే చేపట్టాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇప్పటివరకు ఇలాంటి చర్యలేవీ తీసుకోలేదు. జ్వరాలు ఎక్కువగా ఉన్నపుపడు వైద్యవిద్య సంచాలకుల పరిధిలోని బోధనాస్పత్రుల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా ఫీవర్ క్లినిక్స్ ఏర్పాటు చేయాలి. కానీ, ఇప్పటికీ చేయలేదు.

# రామచంద్రపురంలో ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు




## బీఆర్ఎస్ నాయకుడు పరమేష్ యాదవ్ ఆధ్వర్యంలో వేడుకలు

## భక్తిశ్రద్ధలతో బోనాల జాతర.. భారీగా తరలివచ్చిన భక్తులు

## పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి, మాద్రి పృథ్వీరాజ్

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, ఆగస్టు 9:** అమీన్పూర్ డివిజన్ పరిధిలోని రామచంద్రపురంలో పోచమ్మ తల్లి బోనాల పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు పరమేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు రామచంద్రపురంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, యువత, భక్తులు తరలివచ్చారు. బోనాల వేడుకలకు ముఖ్య అతిథులుగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్ రెడ్డి, మాద్రి పృథ్వీరాజ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య తదితరులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన బోనాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని పోచమ్మ తల్లికి సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు చప్పుళ్ళు, భక్తిగీతాలు, అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. రామచంద్రపురం ప్రజల ఆరాధ్యదైవమైన పోచమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులు గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు. తరతరాలుగా కొనసాగుతున్న బోనాల సంప్రదాయాన్ని కొనసాగించడం ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్నామని నిర్వాహకులు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాకపోకలు, పూజా కార్యక్రమాల నిర్వహణపై కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. బోనాల వేడుకల్లో మహిళలు, చిన్నారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో రామచంద్రపురంలో పండుగ వాతావరణం నెలకొంది. వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన భక్తులు, స్థానికులు, కమిటీ సభ్యులకు నిర్వాహకుడు పరమేష్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.



# శ్రీ శివరామ దుర్గ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

## బిజెపి పార్టీ జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద్ రావు..

## లయ ధర్మకర్తలు వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా మహా హోమం

## ఘనాపూర్ గేటు సమీపంలో శ్రీ శివరామ దుర్గ స్వామి ముఖ ద్వారానికి భూమి పూజ




**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** శ్రీ శివరామ దుర్గ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని బిజెపి పార్టీ జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద రావు పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం ఘనపూర్ గ్రామంలోని శ్రీ శివరామ దుర్గ క్షేత్రం విగ్రహ ప్రతిష్ఠాపన 41వ రోజు సందర్భంగా క్షేత్రాన్ని సందర్శించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శ్రీ శివరామ దుర్గ క్షేత్రం భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలవాలని, ఈ పవిత్ర క్షేత్రం మరింత అభివృద్ధి చెంది భక్తులకు ఆధ్యాత్మిక సేవలను అందించాలని ఆకాంక్షించారు. శ్రీ శివరామ దుర్గ స్వామివారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. దేవాలయంలో మహా హోమం ఘనంగా నిర్వహించారు. వచ్చినా భక్తులకు. అన్నదాత తిర్మలాపూర్ బుయ్యని రాఘవేందర్ రెడ్డి తల్లి బొయ్యని విజయలక్ష్మి వెంకటరెడ్డి హాజరై తమ వంతు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. పూజా కార్యక్రమంలో కుల్కచర్ల గ్రామ సర్పంచ్ వర్వాల అంజిలయ్య, దిశా కమిటీ మెంబర్ డాక్టర్ జానకి రామ్, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు గాదె మహిపాల్, కుల్కచర్ల గ్రామ డిప్యూటీ సర్పంచ్ విజయ్, కంగారి అంజిలయ్య, బాబు కాటన్ పల్లి అంజిలయ్య, రామచంద్రయ్య, మోహన్ నాయక్, బుడ్డోల్ల వెంకటయ్య, దండు అంజిలయ్య, గడుసు మహిపాల్, సాయి కిరణ్, లేగల చంద్రయ్య పాల్గొన్నారు..

# గిరిజన గురుకులాల్లో పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల నియామకం

## అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 09:** సంగారెడ్డి జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2026--27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా పనిచేయడానికి అర్హత కలిగిన, ఇంగ్లిష్ మాధ్యమంలో బోధించగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ గురుకుల రీజినల్ కోఆర్డినేటర్ నాగార్జున రావు తెలిపారు. డిగ్రీ లెక్చరర్ పోస్టులు: సంగారెడ్డి డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, బోటనీ, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయి. జూనియర్ లెక్చరర్ పోస్టులు: ప్రతిభా జూనియర్ కళాశాల (బాలురు)లో కామర్స్, మానూర్ ఎట్ కరాస్ గుత్తి పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు)లో మ్యాథ్స్, నారాయణఖేడ్ పాఠశాల, జూనియర్ కళాశాల (బాలురు)లో జువాలజీ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయి. పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులు: సిర్గాపూర్ పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు)లో మ్యాథ్స్, కాంగ్టి పాఠశాల, జూనియర్ కళాశాల (బాలురు)లో ఫిజికల్ సైన్స్, బయో సైన్స్, సోషల్ స్టడీస్, మానూర్ ఎట్ కరాస్ గుత్తి పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు)లో సోషల్ స్టడీస్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయి. ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులు: నారాయణఖేడ్ పాఠశాల, జూనియర్ కళాశాల (బాలురు)లో ఇంగ్లిష్, కాంగ్టి పాఠశాల, జూనియర్ కళాశాల (బాలురు)లో ఇంగ్లిష్, సోషల్ స్టడీస్, జిన్నారం పాఠశాల, జూనియర్ కళాశాల (బాలురు)లో మ్యాథ్స్, మానూర్ ఎట్ కరాస్ గుత్తి పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు)లో మ్యాథ్స్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయి. ఇదే విద్యాలయంలో సోషల్ స్టడీస్‌లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా జిన్నారం పాఠశాల, జూనియర్ కళాశాల (బాలురు)లో స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పోస్టు ఒకటి ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. విద్యార్హతలు: డిగ్రీ లెక్చరర్ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. అదే సబ్జెక్టులో పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత కలిగిన అభ్యర్థులకు వరుసగా ప్రాధాన్యత ఇస్తారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఎడ్ ఉత్తీర్ణులై ఉండాలి. ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీతో పాటు బీఎడ్ ఉత్తీర్ణులై ఉండాలి. స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పోస్టుకు ఏదైనా డిగ్రీతో పాటు బీపీఎడ్ లేదా బీపీఈడీ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఈ నెల 11న డెమో,


**ఇంటర్వ్యూ:** ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 11న ఉదయం 9 గంటలకు రీజినల్ కోఆర్డినేటర్, గిరిజన సంక్షేమ గురుకుల కార్యాలయం, మానసాహిల్స్, రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జిరాక్స్ సెట్లతో డెమో, ఇంటర్వ్యూకు హాజరు కావాలని నాగార్జున రావు సూచించారు. బాలికల విద్యాలయాల్లోని పోస్టులకు కేవలం మహిళా అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు డీసీఓ-- సంగారెడ్డి జిల్లా 9849237238 నంబర్‌లో సంప్రదించాలని రీజినల్ కోఆర్డినేటర్ నాగార్జున రావు సూచించారు.

# ఎపి కోసం తెలంగాణ నీళ్ల త్యాగం

## సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్

హైదరాబాద్,ఆగస్టు: కర్నాటక, తదితర రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల వల్ల జూరాలకు భారీగా వరద వస్తోందని , వచ్చిన నీళ్లను వచ్చినట్లే తెలంగాణ ప్రభుత్వం మొత్తం ఏపీకి వదిలేస్తుందని బీఆర్ఎస్మాజీ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, బీరం హర్ష మాట్లాడారు. ఏపీ ప్రభుత్వంతో తెలంగాణలోని రేవంత్ ప్రభుత్వం చీకటి ఒప్పందం చేసుకుని, తెలంగాణకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి ఢిల్లీ టూర్లపై ఉన్న దృష్టి పాలమూరు రైతులపై లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో వర్షాలతో వరద ప్రారంభమైన వెంటనే మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లల్లో నీళ్లను నింపి, రైతులకు సమయానికి నీళ్లను అందించేదని స్పష్టం చేశారు. జూరాలకు వరద వచ్చి పదిహేను రోజులైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు రిజర్వాయర్లలో నీళ్లను నింపే ప్రయత్నం కూడా చేయలేదని దుయ్యబట్టారు. రేవంత్ సర్కార్ పనిచేస్తున్నది తెలంగాణ రైతుల కోసమా? పక్క రాష్ట్ర రైతుల ప్రయోజనం కోసమా? అని అనుమానం వ్యక్తం చేశారు. ఎవరినో సంతృప్తి పరచడానికే రేవంత్ రెడ్డి తెలంగాణ రైతులకు అన్యాయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.




# ఈఎస్ఐ ఆసుపత్రుల్లో సమయపాలనపై కఠిన చర్యలు

## మాజీ బోర్డు సభ్యుడు అర్జున్ ఫిర్యాదుతో స్పందించిన డైరెక్టర్ హరిచందన

## డిస్పెన్సరీలు, ఆసుపత్రుల్లో బయోమెట్రిక్ హాజరుపై నిఘా..

## డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 09:** రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, ఓపీడీ సేవలు సక్రమంగా అందకపోవడం, ఐపీ రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న అంశంపై ఈఎస్ఐ మాజీ బోర్డు సభ్యుడు బి. అర్జున్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ హరిచందన దృష్టికి తీసుకెళ్లారు. రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రి పరిధిలోని జిల్లాలోని ఎనిమిది డిస్పెన్సరీల్లోను సమయపాలనను కచ్చితంగా అమలు చేయాలని ఆయన కోరారు. అర్జున్ ఫిర్యాదుపై స్పందించిన డైరెక్టర్ హరిచందన డిస్పెన్సరీల్లో సమయపాలనకు సంబంధించి జూలై 25న, ఈఎస్ఐ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లలో సమయపాలన, బయోమెట్రిక్ హాజరుపై ఆగస్టు 7న మార్గదర్శకాలు జారీ చేసినట్లు అర్జున్ తెలిపారు. ఈ చర్యను ఆయన అభినందించారు. జూలై 25న జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేయాల్సి ఉంటుంది. ఆగస్టు 7న ఆసుపత్రులకు జారీ చేసిన ఆదేశాల ప్రకారం నాలుగో తరగతి సిబ్బంది ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, నర్సింగ్ సూపరింటెండెంట్, నర్సింగ్ సిబ్బంది ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, మెడికల్ సూపరింటెండెంట్ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉండాలని స్పష్టం చేసినట్లు తెలిపారు.

అలాగే ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని, తరచూ ఆలస్యంగా విధులకు హాజరవుతున్న సిబ్బందిని గుర్తించి నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం ద్వారా అధికారుల బాధ్యతను స్పష్టం చేశారని అర్జున్ పేర్కొన్నారు. ఈ మార్గదర్శకాలు రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రితో పాటు జిల్లాలోని ఎనిమిది డిస్పెన్సరీలు, నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి, జీడిమెట్ల డయాగ్నస్టిక్ సెంటర్, వరంగల్ ఈఎస్ఐ ఆసుపత్రి తదితర సంస్థలకు వర్తించేలా జారీ చేయడం స్వాగతించదగ్గ పరిణామమని అన్నారు.

**డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలి**

మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు వాటి అమలు కూడా రోగులు, బీమా లబ్ధిదారులకు స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని అర్జున్, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాండురంగారెడ్డి, జిల్లా సీఐటీయూ సీనియర్ నాయకుడు వాజిద్ అలీ డిమాండ్ చేశారు. ప్రతి ఈఎస్ఐ ఆసుపత్రి, డిస్పెన్సరీ, డయాగ్నస్టిక్ సెంటర్ వద్ద ఓపీడీ సమయాలు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగుల విధి సమయాలను తెలియజేసే డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో రోగులకు వైద్య సేవల సమయాలపై స్పష్టత ఏర్పడటంతో పాటు సిబ్బందిలో సమయపాలన మరింత పెరుగుతుందని వారు పేర్కొన్నారు.

# బోనాల్లో డీజేలకు నో

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: పటాన్‌చెరు పోలీసులు




**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 09:** బోనాల ఉత్సవాలు, ఇతర పండుగల సందర్భంగా డీజేలు వినియోగించడంపై నిషేధం ఉందని పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇంద్రేశం గ్రామంలో నిషేధిత డీజేను వినియోగిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు డీజేను స్వాధీనం చేసుకున్నారు. ఘటనకు సంబంధించి నిర్వాహకులు, డీజే యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రాబోయే పండుగలు, ఉత్సవాల్లోనూ డీజే వినియోగంపై నిషేధం కొనసాగుతుందని ఎస్‌హెచ్‌ఓ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి డీజేలు వినియోగిస్తే నిర్వాహకులు, డీజే యజమానులు, సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీస్‌శాఖకు సహకరించి పండుగలను ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని పటాన్‌చెరు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# గాంధారి మైసమ్మ ఆలయంలో వైభవంగా ఆషాఢ బోనాల జాతర





**రామకృష్ణాపూర్ ఆగస్టు 9( క్రైమ్ మిర్రర్):** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బొక్కలగుట్ట సమీపంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ గాంధారి మైసమ్మ ఆలయంలో ఆషాఢ మాస బోనాల మహా జాతర ఆదివారం కన్నులపండువగా జరిగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా, పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో మురిసిపోయింది. మహిళలు మంగళవాయిద్యాల నడుమ దాదాపు 350కి పైగా బోనాలను నెత్తిన ఎత్తుకుని శోభాయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం, సారె సమర్పించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. మరికొందరు కోళ్లు, మేకలతో నైవేద్యాలు సమర్పించి, పరిసర ప్రాంతాల్లో వంట వార్పులు చేసుకుని బంధుమిత్రులతో కలిసి విందు ఆరగించారు.

**బోనంతో తరలివచ్చిన మున్సిపల్ చైర్‌పర్సన్**

ఈ వేడుకల్లో క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యారాణి రాజారమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె స్వయంగా బోనాన్ని ఎత్తుకుని వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ ప్రతినిధులు క్యూలైన్లతో సహా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించారు.

**పోలీసుల కట్టుదిట్టమైన బందోబస్తు**

రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో, మందమర్రి సీఐ పర్శ రమేష్, ఆర్కేపీ పట్టణ ఎస్సై జాడీ శ్రీధర్ నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు.

**అందరి సహకారంతో జాతర విజయవంతం: ఆలయ కమిటీ**

ప్రతి ఏటా ఆషాఢ మాసంలో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందుతారని ఆలయ కమిటీ అధ్యక్షుడు జక్కుల సమ్మయ్య తెలిపారు. జాతరను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయడానికి సహకరించిన భక్తులకు, ప్రజలకు, స్థానిక సర్పంచ్‌కు, అలాగే మున్సిపల్, పోలీస్, అటవీ శాఖల సిబ్బందికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నాగార్జునసాగర్ లో అడ్డుకొని తీరుతాం

## మాలమహానాడు నాయకులు గోలి సైదులు

**నల్లగొండ క్రైమ్ మిర్రర్ :** చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ లో ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లు 18% పెంచకుండా ఎస్సీలను విడదీసి వర్గీకరణ పేరుతో మాలలకు ద్రోహం చేసి,రోస్టర్ విధానంతో మాలల బ్రతుకుల మీద కొట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీ నాగార్జున సాగర్ లో అడ్డుకొని తీరుతాం అని జాతీయ మాలమహానాడు స్టీరింగ్ కమిటీ సభ్యులు గోలి సైదులు అన్నారు..ఆదివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ..మీ వల్ల ఇప్పటికే కాలేజీలలో సీట్లు రాకుండా చదువుకున్న వారికి ఉద్యోగాలు రాకుండా చాలా నష్టపోయాము అని, చేసిన వర్గీకరణని రద్దు చేయకపోతే మీ ప్రభుత్వాన్ని దించడానికి మాలలం వెనకాడమనే విషయాన్ని కూడా గుర్తు చేస్తున్నాము అని హెచ్చరించారు. మాలలకు ప్రాధాన్యత ఇవ్వాలని గుర్తు చేస్తూ ఈ మధ్యలో వెల్లడించిన పోలీస్ శాఖ,పోలీసులు నోటిఫికేషన్లో ఎస్సై కానిస్టేబుల్ రోస్టర్ విధానాన్ని సవరించే వరకు ఫలితాలు వెలువడించొద్దని హెచ్చరించారు.గతంలో నల్లగొండలో మీరు వచ్చినప్పుడు కనీసం కలవడానికి కూడా అపాయింట్మెంట్ ఇవ్వని మిమ్మల్ని ఈరోజు మోసాలతో చేస్తున్న యాగాన్ని అడ్డుకొని తీరుతాం అని,తెలంగాణ రాష్ట్రం కోసం రాష్ట్రపతి అభ్యర్థిని చరిత్ర మాది అనే విషయాన్ని కూడా గుర్తు చేస్తూ ఉన్నాము..సోమవారం వరుణ యాగానికి వస్తున్నటువంటి ముఖ్యమంత్రినీ అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉండాలని.. మన హక్కులైనా విద్య ఉద్యోగాలను సాధించుకోవడానికి తప్పదని ప్రతి ఒక్క మాల బిడ్డ ముందుకు రావాలి అని సూచించారు.

# ఆన్లైన్ బెట్టింగ్ కి అలవాటు పడి డబ్బుల కోసం వృద్ధురాలి దారుణ హత్య

### వృద్ధురాలి హత్య కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు

### మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో జులై 17 అర్ధరాత్రి వృద్ధురాలిని హత్య చేసి ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన కేసును కూసుమంచి సర్కిల్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి తెలిపారు.ఈ కేసులో ప్రధాన నిందితుడున పిండిప్రోలు గ్రామానికి చెందిన ఐతనబోయిన ప్రశాంత్ (26) అదేవిదంగా అతనికి సహకరించిన బాలినిధర్మారం మర్రిపెడ మండలం మహాబూబాబాద్ జిల్లాకు చెందిన సరగండ్ల మహేష్ (20)లను ఆదివారం ఉదయం తిరుమలాయపాలెం రోడ్డులో పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు.కేసు వివరాలు ప్రకారం పిండిప్రోలు గ్రామంలో చికెన్ షాప్ నిర్వహిస్తున్న ఐతనబోయిన ప్రశాంత్ కు మద్యం సేవించడం ఆన్లైన్ బెట్టింగ్ కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయని తన చికెన్ పాప్ సమీపంలో నివసిస్తున్న వృద్ధ దంపతులను గమనిస్తూ వృద్ధురాలు సుగుణ మెడలో బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించి వాటిని దోచుకోవాలని పథకం వేసుకున్నాడని తెలిపారు.ఈ క్రమంలో జులై 17 న అర్ధరాత్రి సమయంలో వృద్ధురాలి ఇంటికి వెళ్లిన ప్రశాంత్ బంగారు ఆభరణాలు దోచుకునే ప్రయత్నం చేయగా ఆమె ప్రతిఘటించిందని దీంతో తన వెంట తీసుకెళ్లిన ఇనుప రాడ్డుతో ఆమెపై దాడి చేసి హత్య చేసి ఆమె మెడలో ఉన్న బంగారు చైన్ నల్లపూసల చైన్ సంబంధించిన బంగారు బిళ్లలను తీసుకొని అక్కడి నుంచి పరారయ్యాడని తెలిపారు.హత్య అనంతరం దొంగిలించిన బంగారు చైన్ ను తన వరుసకు బామ్మర్ది అయిన సరగండ్ల మహేష్ కు ఇచ్చి బ్యాంక్ లో పెట్టి డబ్బులు తెమ్మని చెప్పగా మహేష్ ఆ బంగారు చైన్ ను తన పేరుతో ఖమ్మంలో ఒక బ్యాంక్ లో తనఖా పెట్టి రూ.1,50,000/- రుణం పొందినట్లు పోలీస్ దర్యాప్తులో వెల్లడైందన్నారు.ఈ కేసు దర్యాప్తు అధికారిగా కూసుమంచి సర్కిల్ ఇన్స్పెక్టర్ సంజీవ్ ఆధ్వర్యంలో కె. జగదీష్, పి సంతోష్, జె. నాగరాజు, హరికృష్ణ , ఎూ× దివ్య తో ఏర్పాటు అయిన నాలుగు ప్రత్యేక బృందాలు సమన్వయంతో దర్యాప్తు చేపట్టి నిందితులను త్వరితగతిన అరెస్ట్ చేసినట్లు తెలిపారు.అలాగే సిబ్బంది పూర్ణ చందర్ రావు, శ్రీలత, కిషన్, రాంబాబు, తొంట శ్రీనులను పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.కేసుకు సంబంధించిన ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. నిందితుల నుండి బంగారు బిళ్లలు (ఏసులు)= 09, మొబైల్ ఫోన్ =02 నేరానికి ఉపయోగించిన ఇనుప రాడ్, ద్విచక్ర వాహనం గోల్డ్ లోన్ సంబంధిత పత్రాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రతిభ చూపిన సిబ్బందికి రివార్డు అందజేశారు.

# సేవా స్ఫూర్తికి ప్రతిరూపం.. కోమటిరెడ్డి లక్ష్మికి జన్మదిన వేడుకలు

### ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని కాంగ్రెస్ శ్రేణుల ఆకాంక్ష



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** ప్రజా సంక్షేమం, సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న కోమటిరెడ్డి, కుటుంబం గురించి ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి, కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మి జన్మదిన వేడుకలను, మర్రిగూడ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు కేక్ కట్ చేసి లక్ష్మికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భగవంతుని ఆశీస్సులతో ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ.. ప్రజాసేవలో మరింత చురుగ్గా భాగస్వామ్యం కావాలని నాయకులు ఆకాంక్షించారు.

**ప్రజా సేవే లక్ష్యంగా..అలుపెరుగని పోరాటం**

రాజకీయ రంగంలో ఎమ్మెల్యేగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనదైన శైలిలో, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండగా.. మరోవైపు ఆయన సతీమణి కోమటిరెడ్డి లక్ష్మి, సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూతనిస్తున్నారు. విద్య, వైద్యం, పేదలకు అండగా నిలవడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ, ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లో సేవా దృక్పథాన్ని పెంపొందించేలా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన, వైద్య శిబిరాలు, అవసరమైన వారికి వైద్య సహాయం వంటి, కార్యక్రమాల ద్వారా తమ సేవా కార్యక్రమాలను విస్తరిస్తోంది. మునుగోడు నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడంతో పాటు.. సామాజిక బాధ్యతను ముందుకు తీసుకెళ్లడంలో రాజగోపాల్ రెడ్డి--లక్ష్మి దంపతులు తమవంతు కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల ప్రజలు, లక్ష్మి ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రామదాసు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి అనిల్ రెడ్డి, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పీఏసీఎస్ డైరెక్టర్లు, మాల్ మార్కెట్ డైరెక్టర్లు, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కట్ట మైసమ్మకు మొక్కులు చెల్లించుకున్న హత్నూర గ్రామస్తులు

### భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. అనంతరం అన్నదానం



హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 09: మండల కేంద్రమైన హత్నూర గ్రామంలోని చాకిచెరువు సమీపంలో వెలసిన కట్ట మైసమ్మ అమ్మవారికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ యువత ఆధ్వర్యంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, యువకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గ్రామదేవతలను భక్తిశ్రద్ధలతో పూజించడం అనాదిగా వస్తున్న సంప్రదాయమని తెలిపారు. ప్రతి ఏటా గ్రామ యువత అంతా ఏకమై కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని కోరుకుంటామని తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో హత్నూర గ్రామ సర్పంచ్ నల్లోల్ల ఎల్లయ్య, ఉప సర్పంచ్ మానస చెక్క రవీందర్ గౌడ్, ట్రేడ్ యూనియన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శివశంకర్ రావు, మాజీ జెడ్పీటీసీ ఆశయ్య, ఆకుల మల్లేశం, మధుసూదన్ గౌడ్, నిఖిల్ గౌడ్, కొండగళ్ల రవి, బోర్పట్ల కిష్టయ్య, పొట్లగళ్ల శంకర్, దుర్గేష్, శేఖర్, మల్లేశం, లక్ష్మణ్, బాలు, నవీన్, రాజు, యాదగిరి, ధనుంజయ, నాగేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆవుల ఆనంద్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు ఆవుల ఆనంద్ యాదవ్ జన్మదిన వేడుకలను నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య తో జరుపుకోవడం జరిగింది. కార్యక్రమంలో చిట్యాల టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.





# నేషనల్ యూత్ కాంగ్రెస్ 26వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో ఆదివారం నేషనల్ యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చింతకాయల జంగయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.యూత్ కాంగ్రెస్ మండల నాయకులు సోషల్ మీడియా కోఆర్డినేటర్ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొమ్ము శ్రీనివాస్, తాలూకా సోషల్ మీడియా కోఆర్డినేటర్ పడేగల భీమ్ భాస్కర్, ఘనపూర్ సర్పంచ్ రవీందర్ నాయక్, వార్డు సభ్యులు మోత్కూర్ వెంకటేష్, పోతగల బాలకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దొమ్మ బాబయ్య, పోతగాల్ల కృష్ణ మాసగళ్ల రాములు, విస్లావత్ బాబు నాయక్, కిన్నెర రాజ, రాంపూర్ నర్సింలు, దొమ్మ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ డెలివరీలో అధిక వసూళ్లు..
# అధికారుల మౌనం..!!

- మహాదేవపూర్ మండలంలో వినియోగదారులపై అదనపు భారం
- నిర్ణీత ధర కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారంటూ ఆరోపణలు
- డీఎం స్పందించాలని డిమాండ్ • ఎవరి వాటా ఎంత..?




**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో గ్యాస్ సిలిండర్ డెలివరీ పేరుతో వినియోగదారుల నుంచి అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు గ్యాస్ బుక్ చేసుకున్నప్పటికీ, ఇంటి వద్ద డెలివరీ సమయంలో అదనంగా డబ్బులు చెల్లించాల్సి వస్తోందని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిలిండర్ ధర బిల్లులో ఒక మొత్తంగా చూపిస్తుండగా.. డెలివరీ సమయంలో మరో మొత్తాన్ని అదనంగా అడుగుతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే డెలివరీ ఛార్జీల పేరుతో సమాధానం చెబుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వినియోగదారుల పరిస్థితిని ఆసరాగా చేసుకుని ఇలా అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**అధికారులు స్పందించాలి..**

గ్యాస్ వినియోగదారుల నుంచి నిర్ణీత ధరకు మించి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వినియోగదారులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు.. వినియోగదారుల ఫిర్యాదులపై మౌనం వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. మండలంలో గ్యాస్ డెలివరీకి సంబంధించి వసూళ్లపై సమగ్రంగా విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా అదనపు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**డీఎం స్పందించాలి..**

మహాదేవపూర్ మండలంలో గ్యాస్ డెలివరీకి సంబంధించి వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న మొత్తాలపై సంబంధిత డీఎం వెంటనే స్పందించి స్పష్టత ఇవ్వాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి వినియోగదారుడికి బిల్లు ప్రకారం గ్యాస్ సిలిండర్ అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అదనపు వసూళ్లపై విచారణ చేపట్టాలని కోరుతున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నప్పుడు అధికారులు స్పందించకపోతే.. వినియోగదారుల సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**ఎవరి వాటా ఎంత..?**

గ్యాస్ డెలివరీలో అధిక వసూళ్ల వెనుక అసలు కథేంటి..?
ఎవరి అండతో ఈ దందా సాగుతోంది..?
ఎవరి వాటా ఎంత అనేది.. తదుపరి కథనంలో!..

**మీ క్రైమ్ మిర్రర్ దినపత్రికలో....**

# వ్యాపార సముదాయం స్లాబ్ పనులను ప్రారంభించిన: జీఎంఆర్

## ఆలయ అభివృద్ధి, నిర్వహణకు సొంత నిధులతో వ్యాపార సముదాయం





పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 09: జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో బండల మల్లన్న దేవాలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న వ్యాపార సముదాయం స్లాబ్ నిర్మాణ పనులను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి, నిర్వహణకు అవసరమైన ఆదాయ వనరులను సమకూర్చే లక్ష్యంతో సొంత నిధులతో వ్యాపార సముదాయ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆలయాల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆల్విన్ కాలనీలోని ఎల్లమ్మ తల్లి, పోచమ్మ తల్లి దేవాలయాల్లో నిర్వహించిన ఆషాఢమాస బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవార్లను ప్రార్థించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మల్లేష్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు.ఒకరు మృతి





**వనపర్తి ఆగస్టు 9 క్రైమ్ మిర్రర్:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ శివారులోని జాతీయ రహదారి–44పై ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బాలాజీ దాబా సమీపంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కాలనీ నుంచి పెబ్బేరు పట్టణంలోకి వస్తున్న ద్విచక్రవాహనాన్ని కడప నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న జుట్టూరు శ్రీనివాస్ శెట్టి (42) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి బాలకృష్ణకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే నేషనల్ హైవే అంబులెన్స్ లో వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి వికలాంగురాలైన భార్య, ఒక కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేష్ గౌడ్ తెలిపారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

## నకిలీ ఏపీకి ఫైల్స్ ను ఓపెన్ చేయకండి ..పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్



**వనపర్తి ఆగస్టు 9 క్రైమ్ మిర్రర్:** నకిలీ ఏపీకే ఫైల్స్ పై అప్రమత్తంగా ఉండాలని, ఈ చలాన్ పేరుతో వచ్చే మెసేజ్లపై జాగ్రత్తగా ఉండాలని ఆదివారం పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ అన్నారు. ఈ చలాన్ పేరుతో వచ్చే లింక్స్ తొందరపడి క్లిక్ చేయొద్దని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో ఆర్టిఓ చాలన్, ఏపీకే, పిఎం కిసాన్, ఎస్బిఐ రివార్డ్స్ ఏపీకే చేయొద్దని, క్లిక్ చేస్తే ఫోన్ లోని రహస్య సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు చోరీ చేస్తారన్నారు. అదేవిధంగా సమాజంలో అందరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏపీకే ఫైల్స్ వంటి వాటిని ఓపెన్ చేయకుండా జాగ్రత్త పడాలని ఎస్ఐ వెంకటేష్ గౌడ్ సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో ఉన్నత భవిష్యత్తును పొందాలని మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తూ జీవితాన్ని సర్వనాశనం చేస్తాయని చెడు అలవాట్లకు లోనై చదువును పక్కన పెట్టి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు



# విఘ్నేశ్వర యూత్ నూతన కమిటీ ఎన్నిక

**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** నూతనకల్ మండల కేంద్రంలో ఆదివారం శ్రీ విఘ్నేశ్వర యూత్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిట్టల మహేష్, ఉపాధ్యక్షుడిగా ఎండ్లపల్లి మహేందర్, ప్రధాన కార్యదర్శిగా ముత్యం మహేష్, కోశాధికారిగా దానబోయిన గణేష్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ.. గ్రామంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు నిరుపేదలకు అండగా నిలుస్తామని తెలిపారు.

# దశ దినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న జాలే నరసింహారెడ్డి....



**చందంపేట టౌన్ ఆగస్టు 09 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** చందంపేట మండలంలోని తెల్దేవరపల్లి గ్రామానికి చెందిన లకుమారపు మల్లయ్య మాతృమూర్తి లకుమారపు నర్సమ్మ దశ దినకర్మ కార్యక్రమంలో ఆదివారం రోజు చిత్రియాల పిఏసిఎస్ చైర్మన్ జాలే నరసింహారెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పార్వతీ చందు నాయక్, ఇప్ప తిరుపతి రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ యాదయ్య, వెంకులు, మరియు తదితరులు పాల్గొన్నారు.

# రామడుగు లో 66వ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు





**రామడుగు, ఆగష్టు 09(క్రైమ్ మిర్రర్):** రామడుగు మండల యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు అనుపురం పరశురామ్ గౌడ్ ఆధ్వర్యంలో రామడుగు మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ చేసి అనంతరం కేక్ కట్ చేసి యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం డైరెక్టర్ మామిడి దిలీప్ కుమార్, యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్,పల్లె రామ్ రెడ్డి,సిరికొండ సాయి తేజ, యువజన కాంగ్రెస్ మండల సోషల్ మీడియా కన్వీనర్ మిల్కి , ఎన్ఎస్యుఐ మండల అధ్యక్షులు జవ్వాజి అజయ్, పూరేళ్ళ రాహుల్,రామ్ ప్రసాద్,శేఖర్,హరిచరన్ , శ్రీనివాస్, విజయ్, మణి ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లేశం మరియు యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

## తెలంగాణ జిల్లాలు



# ఇందిరమ్మ ఇళ్లపై కీలక అప్డేట్..

**20న లాటరీ.. ఎవరికి దక్కనున్నాయంటే?..హైదరాబాద్‌లో తొలి విడతగా 7,340 ఇళ్ల కేటాయింపు**

**ఆగస్టు 10తో దరఖాస్తుల గడువు పూర్తి.. ఇప్పటికే 35,125 దరఖాస్తులు.. మరింత పెరిగే అవకాశం**

**అర్హుల ఎంపిక తర్వాత లాటరీ ద్వారా లబ్ధిదారుల నిర్ణయం**

**అర్హతల పరిశీలన తర్వాత ఈ నెల 20న లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక**

**హైదరాబాద్:** హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది. ఆగస్టు 10తో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుండగా.. ఇప్పటివరకు 35,125 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల పరిశీలన, అర్హతల నిర్ధారణ పూర్తయిన తర్వాత ఈ నెల 20న లాటరీ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులు నిర్ణయించారు. హైదరాబాద్ పరిధిలోని 16 నియోజకవర్గాల్లో తొలి విడతగా 7,340 ఇళ్లను కేటాయించనున్నారు. ఆగస్టు 10 వరకు గడువు ఉండటంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నియోజకవర్గాల వారీగా చూస్తే.. కూకట్‌పల్లి నుంచి అత్యధికంగా 5,233 దరఖాస్తులు వచ్చాయి. ఖైరతాబాద్‌లో 4,394, కుత్బుల్లాపూర్‌లో 4,121, నాంపల్లిలో 3,613, మలక్‌పేటలో 2,846, శేరిలింగంపల్లిలో 2,530, అంబర్‌పేటలో 2,357, కార్వాన్‌లో 1,574, రాజేంద్రనగర్‌లో 1,496, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 1,374, మేడ్చల్‌లో 1,153, బహదూర్‌పురలో 1,135, సనత్‌నగర్‌లో 1,046, మల్కాజ్‌గిరిలో 1,033 దరఖాస్తులు నమోదయ్యాయి. తొలి విడతలో కేటాయించే ఇళ్ల కంటే దరఖాస్తులు సుమారు నాలుగున్నర రెట్లు అధికంగా ఉన్నాయి. ఇళ్లు మంజూరు కాని వారికి దరఖాస్తు ఫీజుగా చెల్లించిన రూ.10,000 తిరిగి చెల్లించనున్నట్లు అధికారులు తెలిపారు. సందేహాల



నివృత్తి కోసం 040-24603572 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలాలను ఇప్పటికే గుర్తించిన అధికారులు.. ఆయా ప్రాంతాల్లో భవన సముదాయాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు నిర్మాణాలను ఏడాదిలోగా పూర్తి చేసి అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



# అంగరంగ వైభవంగా పెద్దమ్మ తల్లి బోనాల పండుగ

**బోనాల పండుగ సందర్భంగా ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనం**

**ప్రత్యేక పూజలు నిర్వహించిన కొంగర రావిరాల, జన్నాయిగూడ ల ముదిరాజ్ సంఘం నూతన కమిటీ సభ్యులు**

**ప్రజల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం--- అధ్యక్షులు ఆకుల రమేష్**

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం రావిర్యాలలో ముదిరాజ్ కుల దైవమైన పెద్దమ్మ తల్లి బోనాలు ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు .తెల్లవారుజామున సుప్రభాత సేవతో ప్రారంభమైన అమ్మవారి ప్రత్యేక పూజలు.. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శి మాట్లాడుతూ భక్తుల సహకారంతో పెద్దమ్మ తల్లి ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేస్తాం అన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం మరింత అత్యంత వైభవంగా మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించడం ప్రత్యేక పూజలు నిర్వహించడం భక్తులు కోరిన కోరికలు నెరవేర్చే పెద్దమ్మతల్లి భక్తుల అధిక సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.అదేవిధంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రముఖులు గ్రామ ప్రజలు ముదిరాజ్ సంఘం నాయకులు ప్రత్యేకంగా దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారి బోనాలు,ఘటం ఊరేగింపులో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి గ్రామ పురవీధులనుండి చివరికి పెద్దమ్మ తల్లి ఆలయానికి చేరుకుని బోనాలను,ఘటాన్ని సమర్పించారు.కొంగర రావిరాల, జన్నాయిగూడ ముదిరాజ్ సంఘం నూతన కమిటీ సభ్యులు

**అధ్యక్షులు ఆకుల రమేష్ ముదిరాజ్ ఉపాధ్యక్షులు**

సొప్పరి దర్శన్ ముదిరాజ్, పిట్టల శ్రీశైలం ముదిరాజ్ సప్పిడి శ్రీరాములు ముదిరాజ్, గోదాసు నర్సింహ్మా ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి మీగడ రాజ్ కుమార్ ముదిరాజ్, కార్యదర్శి పొలమోని ఆంజనేయులు ముదిరాజ్, గోనెమోని దేవేందర్ ముదిరాజ్ పిట్టల రాజు ముదిరాజ్ కోశాధికారి గద్దగూటి వెంకటేష్ ముదిరాజ్,ఉప కోశాధికారి సప్పిడి శ్రీనివాస్ ముదిరాజ్,కందిరీగల సుధాకర్ ముదిరాజ్ కార్యవర్గ సభ్యులు రాగనమోనిప్రబాకర్ ముదిరాజ్,పిట్టల శేఖర్ ముదిరాజ్,గోనమోని రవిందర్,గోదాసు అరుణ్ ముదిరాజ్,పిట్టల శివశంకర్ ముదిరాజ్,గోదాసు రాజు ముదిరాజ్,పిట్టల రవి యాదయ్య గోదాసు ప్రసాద్ ముదిరాజ్,లింగం తిరుమలేష్ ముదిరాజ్ ముఖ్య సలహా దారులు లింగం నర్సింహ్మా ముదిరాజ్,గోనెమోని బాల్ రాజా ముదిరాజ్, రాగనమోని మహేందర్, కాగు హరిరాజు ముదిరాజ్, సొప్పరి యాదయ్య ముదిరాజ్ తలారి శ్రీనివాస్ ముదిరాజ్,సప్పిడి బిక్షపతి ముదిరాజ్,మీగడ కృష్ణ ముదిరాజ్,పొలమోని శంకరయ్య ముదిరాజ్, కందిరీగల చిన్న యాదయ్య ముదిరాజ్,లింగం సురేష్ ముదిరాజ్ గోనమోని యాదయ్య ముదిరాజ్,గోనమోని కుమార్ ముదిరాజ్, బుట్టి జంగయ్య ముదిరాజ్,పిట్టల బాబులు ముదిరాజ్, రాగనమోని మల్లేష్ ముదిరాజ్ రాగనమోని వెంకటేష్ ముదిరాజ్,సప్పిడి సుదర్శన్ ముదిరాజ్,పిట్టల జంగయ్య ముదిరాజ్, గోనమోని అశోక్ ముదిరాజ్,గోనమోని జనార్దన్ ముదిరాజ్

సామ సత్తయ్య ముదిరాజ్, కాగు నర్సింహ్మా ముదిరాజ్, పొలమోని ప్రభాకర్ ముదిరాజ్ మీగడ శ్రీనివాస్ ముదిరాజ్, లింగం శ్రీనివాస్ ముదిరాజ్, లింగం కృష్ణ ముదిరాజ్, పొలమోని మహేందర్ ముదిరాజ్లింగం విజయ్ కృష్ణ ముదిరాజ్ గోదాసు ఇబ్రాహీం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.




# బోనాల వేడుకలో ఫ్లెక్సీ వార్..



**గోమారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల ఘర్షణ**

**గోమారంలో బోనాల పండుగ సందర్భంగా ఫ్లెక్సీల ఏర్పాటు**

**బీఆర్ఎస్ ఫ్లెక్సీకి అడ్డుగా కాంగ్రెస్ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని వివాదం**

**మాటామాటా పెరగడంతో పరస్పరం ఘర్షణకు దిగిన ఇరు వర్గాలు**

**రంగంలోకి దిగిన పోలీసులు.. అదుపులోకి వచ్చిన పరిస్థితి**

**మెదక్, ఆగస్టు :** బోనాల పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు రాజకీయ ఘర్షణకు దారితీశాయి. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలో వివాదం చెలరేగింది. దీంతో కొద్దిసేపు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బోనాల పండుగను పురస్కరించుకుని బీఆర్ఎస్ నాయకులు గ్రామంలో ఓ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయితే ఆ ఫ్లెక్సీకి అడ్డుగా కాంగ్రెస్ నాయకులు మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో ఇరు వర్గాల మధ్య వివాదం మొదలైనట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఇరువర్గాల మధ్య మాటామాటా పెరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారి పరస్పరం ఘర్షణకు దిగినట్లు తెలుస్తోంది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా పోలీసులు అక్కడే ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి అదుపులో ఉన్నట్లు సమాచారం. అయితే ఘర్షణకు అసలు కారణం ఏమిటి? ఘటనలో ఎంతమంది పాల్గొన్నారు? ఎవరైనా గాయపడ్డారా? ఈ వ్యవహారంలో కేసులు నమోదయ్యాయా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

# రష్యా నుంచి భారత్‌కు రైలు మార్గం..

వెల్లడించారు. రష్యా వార్తా సంస్థ 'టాస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక విషయాలను తెలిపారు. కీలకమైన సముద్ర మార్గాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని ఖుస్నుల్లిన్ ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. ముఖ్యంగా, బోస్ఫరస్ జలసంధి, హర్మూజ్ జలసంధి వంటి అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన మార్గాలలో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకుని, వాటికి ప్రత్యామ్నాయంగా భూమార్గ రవాణా కారిడార్లను అభివృద్ధి చేయాలని రష్యా భావిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రపంచ చమురు వాణిజ్యంలో దాదాపు 25 శాతం, ఎల్ఎన్‌జీ రవాణాలో 20 శాతం హర్మూజ్ జలసంధి నుంచే జరుగుతుంది. ఈ మార్గాల్లో ఉండే ఉద్రిక్తతలు, ఇబ్బందులు తమ దేశ రవాణా వ్యవస్థపై ప్రభావం చూపకూడదనేది రష్యా వ్యూహంగా కనిపిస్తోంది. ఈ ప్రణాళికలో భాగంగా, రష్యా నుంచి బయలుదేరి తుర్క్‌మెనిస్థాన్, ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మీదుగా భారత్‌కు చేరుకునేలా ఒక రైల్వే కారిడార్‌ను నిర్మించడం ఒక ఆచరణీయమైన మార్గంగా ఖుస్నుల్లిన్ పేర్కొన్నారు. అయితే, భారత్‌కు చేరువయ్యేందుకు ఏ మార్గమైనా తాము పరిశీలించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన కేవలం ప్రాథమిక అన్వేషణ దశలోనే ఉంది. రైల్వే మార్గం, ప్రయాణికుల రైలు సర్వీసులు, టికెట్ ధరలు లేదా ప్రాజెక్టు ప్రారంభ తేదీ వంటి వివరాలేవీ ఇంకా ఖరారు కాలేదని ఆయన తెలిపారు.ఈ రైల్వే కారిడార్ వాస్తవరూపం దాల్చితే రష్యాకు, భారత్‌కు ఇరు దేశాలకూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. సముద్ర మార్గాలపై పూర్తిగా ఆధారపడకుండా, హిందూ మహాసముద్రం వైపు తమ సరుకులను రవాణా చేయడానికి రష్యాకు ఇది మరో ముఖ్యమైన మార్గాన్ని అందిస్తుంది. అదే సమయంలో, మధ్య, దక్షిణాసియాతో రష్యాకు భూమార్గ కనెక్టివిటీ మరింత బలోపేతం అవుతుంది. భారత్‌కు కూడా ఈ కారిడార్ ద్వారా రష్యా, మధ్య ఆసియా దేశాలతో వాణిజ్య, రవాణా సంబంధాలు మెరుగుపడతాయి. ప్రజల రాకపోకలు పెరిగి పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.అయితే, ఈ ప్రతిపాదన ఆచరణలోకి రావడం అంత సులభం కాదు. ఈ మార్గం పలు దేశాల గుండా వెళ్లాల్సి ఉండటం, భారీగా మౌలిక సదుపాయాలు కల్పించాల్సి రావడం వంటి సవాళ్లు ఉన్నాయి. ముఖ్యంగా, రవాణా, భద్రత, సరిహద్దుల వద్ద సమన్వయం వంటి అనేక క్లిష్టమైన అంశాలు ఈ ప్రాజెక్టుతో ముడిపడి ఉన్నాయి.


GHMC
hmda Growing Global
TS-bPASS

MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595


Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.